# ఆడంబరం ఖరీదు

(1985 సెప్టెంబర్. జాగృతి.)

---

పవిత్రమైన పెళ్ళితంతు ఓ సాంప్రదాయం. కానీ ఆడంబరం సంప్రదాయం కానక్కరలేదుకదా!

—జయప్రద

---

'నీ మాటే వినుంటే నేనీరోజు ఇలా ఒంటరిగా మిగలక పోదును వేదా!' నా స్నేహితురాలి కంఠంలో కదలాడిన తడికి నా కళ్ళు చెమ్మగిల్లాయి.

ఏమైనా ఆమె నా బాల్య స్నేహితురాలు.

స్వప్న, సింధూర ఏకకాలంలో భూమ్మీద రాలిన ఏక గర్భ వాసులే అయినా ఇద్దరి మనస్తత్వంలో ఎంత తేడా?

స్వప్న లేనిది కావాలనుకునే రకమైతే సింధూర వున్నదాంట్లో కాళ్ళు ముడుచుకునే రకం.

ఇది పాతికేళ్ళనాటి మాట.

ఆ కాడు స్వప్న తెల్లగా నవనవలాడుతూ ఎంత అందంగా ఉండే దసి!

ఆమె జీవితమూ తక్కువ అందమైందేమీ కాదు! గుణవంతుడైన భర్త, ఆర్థికంగా ఏ చీకూచింతా లేని జీవితం ముత్యాల్లాంటి పిల్లలు

సింధూరకు, స్వప్నకు ఒకేసారి పెళ్ళయింది. కానీ సింధూరను చూసి అందరూ జాలిపడ్డవాళ్ళే.

అతను గుణవంతుడే కానీ ఆస్తిపరుడు మాత్రం కాదు. ఈ అక్క చెల్లెళ్ళు కలిసినప్పుడల్లా నేను గతంలోకి జారుకోకుండా వుండలేను.

* * * *

"ఇంటికెళదాం రా నీలూకి పట్టుచీరెలు తెచ్చాను చూద్దూగాని...." పెళ్ళికూతురు అమ్మలా కాకుండా పెళ్ళికూతురిలా వచ్చింది స్వప్న. ఆమె కట్టుకున్న చందనం కలర్ జరీ ముద్దలాటి పట్టుచీర ఖరీదెంతో అడగలేదు.

వింటే ఆ ధరకు నా గుండె పగిలిపోవచ్చు.

స్వప్న ఇంటికి వెళ్ళగానే డబల్‌కాట్‌నిండా పరిచున్న చీరలు చూసి నా గుండె పగల్లేదు కానీ నాకళ్ళు తిరిగాయి.

"ఇన్ని చీరలా?" అని అనకుండా వుండలేకపోయాను.

"ఇవెన్ననీ! కంచిలో ఒక్కటీ కొత్త డిజైన్ లేదనుకో!" వినుగొచ్చింది.

"థాంక్స్ టు కంచి ఇంకా మంచి డిజైన్‌లుంటే ఇంకెన్ని చీరెలు కొనేదో"

చీరెలు లెక్క పెడుతూ ఈసారి అడగకుండా వుండలేకపోయాను నా గుండె పగిలినాసరే.

"ఇవన్నీ ఎంతయినాయి స్వప్నా!"

"డెబ్బయ్‌వేలు. నా అంచనాకు నాలుగురెట్లు ఓ మధ్యతరగతి తండ్రి సునాయాసంగా ఇద్దరాడపిల్లలకు పెళ్ళి చేయగలిగిన మొత్తం" అదే అన్నాను స్వప్నతో.

"భలేదానివే! ఈమాత్రం కొనకపోతే నలుగురిలో చిన్నతనం కాదూ!"

నేను కళ్ళెత్తి స్వప్న కళ్ళల్లోకి చూసాను.

తన తొలి సంతానానికి ఘనంగా పెళ్ళిచేస్తున్న మైకంలో ఉన్నాయవి.

మంచిదే! ఎవరి ఆనందం కొరకు వాళ్ళు ఖర్చుపెట్టుకోవడానికే డబ్బుండేది! కానీ ఒక్క చీరల మీదే డెబ్బయ్ వేలు ఖర్చుపెట్టగల స్తోమతున్న కుటుంబమేనా స్వప్నది. కాదని కృంగి కృశించిపోతున్న స్వప్న భర్త భావనారాయణరెడ్డి ముఖమే చెపుతోంది.

కొన్ని లక్షల అప్పుని తండ్రికి కొండంత తృప్తిని తల్లికి మిగిల్చి అత్తగారింటికి వెళ్ళిన నీలిమలో మాత్రం సంతృప్తిలేదు.

మరో పదినెలలో కుదిరిన చెల్లెలి పెళ్ళికి కట్టుకోను ఆ పిల్లకు తల్లి తీసిచ్చిన అన్ని పట్టుచీరల్లో ఒక్కటీ నచ్చలేదు!

"ఏదో ఒకటి సర్దుకో నీలూ....!" అని అంటూన్న నావైపు తిరిగింది.

"ఏం కట్టుకోను మా వాళ్ళందరికీ ఈ చీరెలు చూపించి చూపించి నాకీ చీరలంటే బోర్ కొట్టేసింది. సింధూర పిన్ని ఎంత తెలివిగా చేసిందో" నిట్టూర్చింది నీలిమ.

"ఇప్పుడు స్వంత చెల్లెలి పెళ్ళికి పాతచీర కడితే మా అత్తగారేమనుకుంటారు?" గొణిగింది.

నిజమే సింధూర కూతురి పెళ్ళి పొదుపుగాచేసి పాతికవేల రూపాయలు కూతురు పేరున బ్యాంకులో వేసింది. ఆ మొత్తం నీరజకు మనోధైర్యాన్నిస్తూ సురక్షితంగా బ్యాంకులో వుంది.

అది అందించే వడ్డీతో కోరుకున్నది కొనుక్కుంటోంది నీరజ! కానీ నేనా మాట నీలిమతో అనలేదు.

"ఏదో ఒకటి కట్టుకుందూ" అని విసుక్కోబోయి ఆగాను.

'అసలు తప్పు స్వప్నది! నీలిమ నెందుకనడం?'

ఏడుగుతున్న కూతురివి పొట్టయిపోయిన ఫ్రాక్స్‌ని పారేసేదే కానీ సర్దుకోమని చెప్పంటేకదా స్వప్న.

ఈనాడు ఎదగడం మానేసిన కూతురు ఎదక్కుండా బీరువాలో మిగిలిపోయిన నిన్నటి పట్టుచీరలు కట్టటానికి.

"సరేలే బాధపడకు ఐదు వేలిస్తాను నీకు నచ్చింది కొనుక్కుందువుగానీ" అని కూతుర్ని ఓదార్చిన స్వప్న, కూతురు మొండిపట్టుదలకి బాధపడి ఓ వేడి నిట్టూర్పు వదిలిన స్వప్న చిన్న కూతురి పెళ్ళిబట్టల దగ్గరకొచ్చేసరికి విభిన్నంగా ఏమీ చేయలేదు.

మనసు ఉండబట్టలేక....

"మరలా అదే పొరపాటు చేస్తున్నావు స్వప్నా" అని తను అడిగినప్పుడు....

"తప్పదులే వేదా! లేకపోతే నల్గురిలో వెలితయిపోతాము. నాల్గు ఫ్యాన్సీ చీరలు తగ్గిద్దాంలే" అంది.

నవ్వుకున్నాను నేను.

ఫ్యాన్సీ చీరలు, కోటా చీరలు, గార్డెన్ సిల్క్ చీరలు ఇంకా చాలా చాలా. ఆ పేర్లు నాకు తెలీవు. నూటచిల్లర చీరల్లో నాల్గు చీరలు తగ్గిస్తుందా?

ఆరోజు నవ్య కోడరికానికి వెళ్ళేరోజు నేను స్పృహ కోల్పోయాను.

నవ్యతో అత్తగారింటికెళ్ళే వస్తువులతో పెద్ద హాలు నిండిపోయింది.

బస్తాడు ఎండుకొబ్బరి, బస్తాడు జీడిపప్పు, బిందెడు పి.టి. వక్కలు, ఐదు బుట్టల స్వీట్స్, బస్తాడు కొబ్బరికాయలు, మూడు బుట్టల పండ్లు, రెండు అరటిగెలలు ఇలా....ఇలా ఇంకా ఏవేవో....

నా జీవితంలో వాటిని చూసానేగానీ ఇలా బస్తాలు బస్తాలుగా చూసి ఎరుగను.

"ఇన్ని....ఇన్నేం చేసుకుంటారు స్వప్నా వాళ్ళు" విపరీతమైన ఆశ్చర్యంతో అడిగాను.

నవ్వింది స్వప్న చాలా గర్వంగా.

చాలా తృప్తిగా నవ్వింది.

"భలేదానివే వాళ్ళే ఉంచుకుంటారా ఏమిటి? నాలుగురోజుల్లో ముక్కిపోవూ! బంధువులంతా పంచుకుంటారు"

"అందరికీ పంచుకునేదానికి ఎందుకు చెప్పు ఇంత ఖర్చు?"

"ఇలాటి చోటే ఖర్చుకు వెనకాడకూడదు వేదా! అందరికీ ఇది పంచేప్పుడు ఫలానా స్వప్న కూతురుకి పెట్టిన సారె అని ఘనంగా చెప్పుకుంటారు"

నాకు నీరసం వచ్చేసింది. ఇంకా ఎప్పుడు తెలుసుకుంటుంది స్వప్న?

ఇంకా పెద్ద కూతురు పెళ్ళిచేసిన అప్పులే తీరలేదు ఏమిటీ ఖర్చులు? ఎప్పుడు వీటికి స్వప్న మంగళహారతి పాడేది?

ఇలా చూస్తూ ఊర్కోడానికి నా మనస్సు అంగీకరించలేదు.

"స్వప్నా! నేను అసూయపడుతున్నానని నువ్వనుకోకపోతే...."

"ఛీ ఛీ! నేనలా ఎందుకనుకుంటాను."

"అనుకోవనుకో మాడూ! నువ్వు చాలా ఆడంబరాలకుపోతున్నావు. ఈ అనుకునేవాళ్ళు నీకేదయినా అవసరంవస్తే ఆదుకుంటారా చెప్పు? కాస్త వెనక్కి తిరిగి చూసుకో ఇధప్పుయినా కళ్ళు తెరువు. చక్రిని అన్యాయం చేయకు స్వప్నా."

కొద్దిగా దిగులుగా చూసింది స్వప్న.

"నిజమే! కానీ ఇలాటిచోట పొదుపుచేస్తే నలుగురూ మమ్మలినీ కీతాగా అనుకోరూ! మా తోడికోడలికి తీసిపోతామా చెప్పు. హుఁ క్నా నాలుగు కాలాలపాటు మేము లక్షణంగా వుండాలేగానీ వాడికి మాత్రం కొరవ చేస్తామా?"

ఆ అసురసంధ్యవేళ ఆమెలో కలిగిన ఆశ నిజం కాలేదు. సంవత్సరం రోజులలో చక్రధర్ పెళ్ళికి వెలిగిన వీడియో ఫ్లాష్‌లకాంతి మా గుండెల్లో మాసిపోకముందే మా స్వప్న పసుపు-కుంకుమలు తుడిచి పెట్టుకుపోయాయి.

"భర్తపోయి నాలుగేళ్ళయినా ఇంకా పచ్చిపుండులాగ ఆ బాధ ఆమెను బాధిస్తుండగానే మరో పురుడుకొచ్చిన రెండో కూతురికి కళ్ళనీళ్ళతో చీరసారెలు సర్దుతున్న తల్లి దగ్గరకు వచ్చిన చక్రధర్ తల్లిని ఓదార్చలేదు.

"అమ్మా! నేను వేరుకాపురం పెట్టాలనుకుంటున్నాను నా భాగం నాకు పంచివ్వు."

చాక్లెట్ ఇవ్వు మమ్మీ అన్నంత సులువుగా అడుగుతున్న కొడుకు వంక మొదట విస్తుబోయి చూసింది స్వప్న. తర్వాత మెత్తగానే అంది.

"ఇక్కడ ఎంతమంది వున్నామనిరా పంచుకోవడానికి నీకూ, నాకూ మధ్య పంపకాలేమిట్రా చక్రీ."

అతను తలవంచుకుని గొణిగినట్లుగా అన్నాడు.

"నా కివ్వాల్సిందేదో యిచ్చేస్తే, నువ్వు కాస్త వుంచుకునీ...." ఆమె గుండె ఎలా వుందో కానీ అది విన్న నా గుండెమాత్రం నీరు అయింది.

"నేను కాస్త వుంచుకోవాలా? ఏముంచుకోవాలి చక్రీ! నువ్వెళ్ళిపోయిన శూన్యాన్నా?"

"నీ పేరున పదివేలేస్తాను అదే....నీ చేతిఖర్చులకు" ఆమె గుండె ఈసారి పగిలినట్లయింది.

"ఏమి చేసుకోనురా చక్రీ దాన్ని నేను, నువ్వు లేకపోయాక"

"అక్కల పురుళ్ళ-పుణ్యాలు ...నీ చేతిలో లేకపోతే ఎలా?"

తనయుడి ఆంతర్యం బోధపడింది. స్వప్న మనస్సు మూలిగింది.

"చక్రీ! ఎవరో కాదురా వాళ్ళు నీ అక్కలురా."

ఆ ప్రక్కనున్న బండరాళ్ళు కరిగుంటాయి కానీ ఆ తల్లి చేతుల్లో పాతికేళ్ళు పెంచబడ్డ చక్రధర్ కరగలేదు. వున్నదంతా ఖర్చుపెట్టి తనను బికారిని చేసిన తల్లి అతనికి శత్రువు.

"ఏరా మాట్లాడవు?"

"ఏం మాట్లాడేదీ? మాట్లాడడానికేమీ లేదు. నలుగుర్నీ పిలువు నాకు రావాల్సింది నాకు పంచిచ్చేయ్."

ఈసారి స్వప్నలో సహనం చచ్చిపోయింది.

"ఏరా ఏమన్నావ్? నీది నీకు పంచాలా? తాతల ఆస్తులేమీ ఇప్పుడు మిగిలిలేవురా ఏదయినా మిగిలుంటే అది నీ తండ్రి స్వార్జితంరా."

"ఓహ్ అదా! చాలా థాంక్స్ అమ్మా-నీలాటి అమ్మలు జన్మ జన్మలకు ఎవ్వరికీ వద్దు. ఆల్‌రైట్ నా భార్య కట్నం డబ్బులు యిలా పారేయ్ మేమెళ్ళిపోతాం."

స్వప్న కాళ్ళల్లో ఇక శక్తి మిగిలిలేదు. అక్కడున్న కుర్చీలో కూలబడిపోయింది.

"ఒరే ఒరే! భార్య కట్నం డబ్బులతోనే ఇంతవరకు పెరిగావట్రా నువ్వు?"

ఇంతవరకు శ్రోతలా వింటున్న నేను చలించిపోయాను.

"నిజమే అమ్మా, నా భార్య కట్నం డబ్బుతో నేను పెరగలేదు. ఒప్పుకుంటున్నాను. కానీ ఇక దానితోనయినా పెరగాలనుకుంటున్నాను. నా పిల్లల్ని పెంచాలనుకుంటున్నాను. ఏం నేను బాగుపడితే చూడలేవా నువ్వు?"

విసురుగా లేచి అంతే విసురుగా ప్రక్కరూమ్‌లో కెళ్ళిపోయాడు చక్రి.

స్వప్న భుజంమీద చెయ్యివేసాను. ఆమె తలెత్తి, కళ్ళెత్తి నావేపు చూసింది. ఆ కళ్ళనిండా కన్నీళ్ళు.

నా పమిటకొంగుతో కన్నీళ్ళు తుడిచి చిన్నప్పుడు ఆడుకున్న చేతులతో ఆమెను లేవనెత్తి పడుకోబెట్టి దుప్పటికప్పి చక్రధర్ గదిలోకి నడిచాను.

* * * *

"చక్రీ! మీ అమ్మ దుబరాఖర్చే చేసింది, నేనొప్పుకుంటాను.కానీ, కానీ చక్రీ ఏ ఖర్చూ తనకొరకు చేసుకోలేదురా! మీకు గుడ్డలుకొన్నది, మీకు పెళ్ళిళ్ళు చేసింది. ఏంచేసినా మీకొరకే, మీ ఆనందం కొరకేరా!"

చక్రధర్ తలతిప్పి చూసాడు. ఈసారి ఆ కళ్ళల్లో కోపం లేదు. ఆ విసురులేదు. ఆ నిర్మోహమాటంలేదు. అవి జాలిగా చూస్తున్నాయి. పశ్చాత్తాపంతో చలిస్తున్నాయి.

"ఆంటీ అయామ్‌సారీ ఆంటీ! కానీ ఆంటీ, ఒక్కటి నువ్వు గుర్తుపెట్టుకోవాలి. చిన్నప్పుడు మాకే బట్టలువేసినా మా శరీరాన్ని తాకుతాయి కానీ దాని ఖరీదు, దాని అందం మా మనసుకు అంటదు.

ఏదీ లేకున్నా ఆనందంగా తృప్తిపడే రోజులవి. కానీ మాకు నిజమైన ఖర్చులు ఈరోజు మొదలవుతున్నాయాంటీ! మీరయినా అమ్మను ఎందుకు చెక్ చెయ్యలేదాంటీ! ఈరోజు నన్నెందుకిలా బికారిగా నిలబెట్టారు? చెప్పాంటీ?"

అతను నిలదీసి అడుగుతున్నాడు. అతని ప్రశ్నలో నిజాయితీ వుంది. సత్యం వుంది. అతనికి జవాబు చెప్పే శక్తి నాకు లేకపోయింది. నిశ్శబ్దంగా నడుచుకుని స్వప్న రూమ్ దగ్గరకొచ్చాను.

అప్పుడన్నది స్వప్న.

"నీమాటే వినుంటే నేనీరోజు ఇలా ఒంటరిగా మిగలకపోదును" అని.

దిగులుగా చూశాను. ఓదార్పుగా చెయ్యి పైనవేసాను.

నాతోపాటు పుట్టిన సింధూర ఎంత తెలివయింది వేదా. సింధూరకు ముగ్గురు బిడ్డలు మిగిలారు. నాకే ఒక్క బిడ్డా మిగలలేదు"

ఆమె కళ్ళల్లో నీళ్ళు దిండులో కరిగిపోయాయి.

*